ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 37 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 17 మే 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



## పీవోకేపై పట్టు కోల్పోయేలా చేసారు

నాటి కాంగ్రెస్ తప్పిదాలపై జైశంకర్ ఘాటు విమర్శలు

2లో..



## యూపీలోనూ 'టీఎంసీ' తరహా రాజకీయాలకు యత్నం

### విపక్షాలపై మోదీ ధ్వజం

న్యూఢిల్లీ, మే 16 (ప్రభాత ఉదయం): ఉత్తర్‌ప్రదేశ్‌లోనూ 'తృణమూల్ కాంగ్రెస్ తరహా రాజకీయాలను తీసుకొచ్చేందుకు కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు యత్నిస్తున్నాయంటూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతోందని.. మహిళలు, ఎస్సీలను వేధిస్తోందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో యూపీలోని భదోహీ, ప్రతాప్‌గఢ్‌లలో నిర్వహించిన ప్రచార సభల్లో మోదీ పాల్గొని ప్రసంగించారు. విపక్షాల తరపున భదోహీ నుంచి

..మిగతా 2లో

## రాష్ట్ర ఆదాయం పెంపుపై

# సీఎం సమీక్ష

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



హైదరాబాద్, మే 16 (ప్రభాత ఉదయం): రాష్ట్ర ఆదాయం పెంచేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, పన్నుల ఎగవేత లేకుండా కఠిన చర్యలు చేపట్టాలని హెచ్చరించారు. వార్షిక లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరిగేందుకు అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సూచించారు. అవసరమైన సంస్కరణలు చేపట్టాలని ఆదేశించారు. శాఖాపరమైన లొసుగులు లేకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని సీఎం రేవంత్ ఆదేశించారు. రాష్ట్రానికి ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే వాణిజ్య పన్నులు, స్టాంపులు రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, మైనింగ్ విభాగాల అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు సచివాలయంలో సమావేశమయ్యారు. గత ఏడాది వచ్చిన ఆదాయం ఆశాజనకంగా లేదని ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై ప్రతి నెలా ఆదాయ పెంపును సమీక్షించుకోవాలని అధికారులను అప్రమత్తం చేశారు. బడ్జెట్లో పొందుపరిచిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఏ నెలకు ఆ నెల మంత్లీ టార్గెట్‌ను నిర్దేశించుకొని రాబడి సాధించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా రాష్ట్రానికి రాబడి తెచ్చిపెట్టే జీఎస్టీ ఎగవేత లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జీఎస్టీ కలెక్షన్ పెంచేందుకు పక్కాగా ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్, ఆడిటింగ్ జరగాలని సూచించారు. జీఎస్టీ ఎగవేతదారులు ఎంతటివారైనా ఉపేక్షించకుండా, నిక్కచ్చిగా పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. వాణిజ్య శాఖలో ఇంతకాలం జరిగిన పొరపాట్లు పునరావృతం కావద్దని, జీఎస్టీ రిటర్న్ పేరిట వెలుగులోకి వస్తున్న అవినీతి అక్రమాలకు తావు లేకుండా వ్యవహరించాలని అధికారులను హెచ్చరించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎన్నికల సీజన్‌లో మద్యం అమ్మకాలు, విక్రయాలు ఎక్కువగా జరిగినా లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరగకపోవటానికి కారణాలను సీఎం ఆరా తీశారు. అక్రమంగా మద్యం రవాణా, పన్ను ఎగవేత లేకుండా కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలో అన్ని చోట్ల భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయి. కానీ అదే స్థాయిలో రెవిన్యూ రాబడుల్లో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం పెరగలేదని ఈ సందర్భంగా చర్చ జరిగింది. చాలా చోట్ల భూముల మార్కెట్ విలువకు, వాస్తవ క్రయ విక్రయాల రేట్లకు పొంతన లేకపోవటం ప్రధాన కారణమనే చర్చ జరిగింది. గత ప్రభుత్వం 2021లో భూముల విలువను, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచింది. ఇప్పటికీ చాలాచోట్ల భూముల మార్కెట్ విలువకు, క్రయ విక్రయ ధరలకు భారీ తేడా ఉంది. నిబంధనల ప్రకారం ఏడాదికోసారి భూముల మార్కెట్ విలువను సవరించాల్సి ఉంటుంది. ఈ ధరల సవరణకు చర్యలు చేపట్టాలని

..మిగతా 2లో



## తెలంగాణ రైతులకు

# శుభవార్త

### రేవంత్ సర్కార్ కీలక నిర్ణయాలు

హైదరాబాద్, మే 16 (ప్రభాత ఉదయం): రుణమాఫీ పథకం విధివిధానాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులతో చర్చించారు. ఖరీఫ్ 2024 నుండి అమలు అయ్యే పంటల భీమా విధివిధానాలపై దిశా నిర్దేశం చేశారు. టెండర్లలో పేర్కొనే నిబంధనలు, ముందుకు వచ్చే కంపెనీలకు ఉన్న అర్హతలు.. మున్నగునవన్నీ ఒకటికి రెండు సార్లు పరిశీలించుకొని, రైతులు పంటనష్టపోయిన సందర్భములో ఈ భీమా పథకం వారిని ఆదుకొనే విధంగా ఉండాలని మంత్రి తెలిపారు. పథక అమలుకు ఆదర్శ రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను కూడా పరిగణలోనికి తీసుకోవాల్సిందిగా సూచించారు. మరోవైపు.. పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై సరఫరాకు విధివిధానాల రూపకల్పన చేశారు. వెంటనే సరఫరా ప్రారంభించి, సరఫరాలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడగలరని టీఎస్ సీడ్స్ అధికారులకు దిశానిర్ధేశం చేశారు. మొదటి విడత పంటనష్ట పరిహారం రూ.15 కోట్లు పంపిణీ పూర్తయినందున, రెండోవిడత (ఏప్రిల్ మాసములో) మూడోవిడత (మే మాసములో) జరిగిన పంట నష్ట వివరాల సమర్పణకు ఆదేశాలు ఇచ్చారు. ఇదిలా ఉ ంటే.. మట్టి నమూనా పరీక్షా కేంద్రాల సామర్థ్యం అనుసరించి, వెంటనే రైతుల విజ్ఞప్తి మేరకు అవసరమున్న రైతుల పొలాల మట్టి నమూనాలు సేకరించి ఫలితాలు వచ్చే నెలాఖరులోగా అందచేసేటందుకు ప్రణాళిక చేసుకోవల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. వరి కొయ్యలు కాల్చకుం డా యుద్ధప్రాతిపదికన రైతులకు అవగాహన కల్పించడం, అప్పటికీ వినకపోతే సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ, వరి కొయ్యలు తగలపెడితే జరిమానాలు విధించాల్సిం దిగా మంత్రి ఆదేశాలు ఇచ్చారు. మార్క్ ఫెడ్ ద్వారా మొక్కజొన్న, జొన్న, పొద్దుతిరుగుడు కొనుగోళ్ళను వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా పూర్తి చేసేవిధంగా ఆదేశాలు ఇచ్చారు. మరోవైపు.. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ కేటాయించిన భూములలో ఆధునిక సాంకేతికతతో పండ్లతోటల పెంపు మరియు నిర్వహణ బాధ్యతలు తీసుకొనే విధంగా ఆదేశాలు జారీ చేశారు. ఆయిల్ ఫాం కంపెనీల పనితీరు ఆధారంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మరోవైపు.. మల్బరీ సాగుకు అనుకూల ప్రాంతాలను ఎంపిక చేసి పట్టు పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలలో మ్యాచింగ్ గ్రాంటు బకాయి నిధుల విడుదలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాల్సిందిగా ఆదేశాలు ఇచ్చారు. అన్ని రకాల సహకార సంఘాలలో సభ్యుల గుర్తింపు మరియు పదవీకాలం ముగిసిన సంఘాల ఎన్నికల నిర్వహణకు సత్వరమే చర్యలు తీసుకోవాలని కోరారు.



## తెలంగాణలో పలుచోట్ల

# భారీ వర్షాలు

### నగరంలో ఉరుములతో దంచికొట్టిన వాన

### ఈదురు గాలులతో పలుచోట్ల విద్యుత్ అంతరాయం

హైదరాబాద్, మే 16 (ప్రభాత ఉదయం): తెలంగాణలోని పలుచోట్ల భారీ వర్షాలు కురిసాయి. హైదరాబాద్ నగరంలో కుండపోత వర్షం కురిసింది. గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో భారీ వర్షంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. గచ్చిబౌలి, కూకట్‌పల్లి, నిజాంపేట్, హైదర్‌నగర్, బాచుపల్లి, బోయిన్‌పల్లి, మారేడుపల్లి, బేగంపేట్, ప్యారడైజ్, చిలకలగూడ, అల్వాల్, జవహర్‌నగర్, మల్కాజిగిరి, నేరేడ్‌మెట్, నాగారం, కుత్బుల్లాపూర్, చింతల్, షాపూర్‌నగర్, గాజులరామారం, సూరారం, బహదూర్‌పల్లి, షేక్‌పేట, రాయదుర్గం, పంజాగుట్ట, బోరబండ, రెహమత్‌నగర్, ఉప్పల్ తదితర ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షం కురుస్తోంది. రోడ్లపైకి వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. నగరంలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురుస్తోంది. ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఏకధాటిగా బలమైన ఈదురు గాలులతో కూడిన

..మిగతా 2లో

## ఏపీలో హింసాత్మక ఘటనలపై

# ఈసీ సీరియస్

### కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదించిన సిఎస్

**సిఎస్‌తో పాటు హాజరైన డిజిపి హరీష్ కుమార్ గుప్తా**

**అరగంటపాటు పరిస్థితులపై వివరించిన సిఎస్**

**అధికారుల ఉదాసీనతపై ఆగ్రహించిన ఈసీ**




న్యూఢిల్లీ, మే 16 (ప్రభాత ఉదయం): ఏపీలో ఈ నెల 13న పోలింగ్, అనంతరం జరిగిన హింసాత్మక ఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘం ముందు గురువారం సీఎస్, డీజీపీలు హాజరై వివరణ ఇచ్చారు. తమవద్ద ఉన్న సమాచారాన్ని అందించారు. అయితే వీరి తీరుపై కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. వీరికి ఇసి నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సీఎస్ జవహర్ రెడ్డి , డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సీఈసీ ఎదుట గురువారం హాజరయ్యారు. రాష్ట్రంలో పలుచోట్ల జరిగిన హింసాత్మక ఘటనలపై వారు వివరణ ఇచ్చారు. వీరితో పాటు నిఘా విభాగాధిపతి కుమార్ విశ్వజిత్ సైతం ఉన్నారు. మాచర్ల, నరసరావుపేట, చంద్రగిరి, తాడిపత్రిల్లో పోలింగ్ రోజు, అనంతరం హింస చెలరేగడంపై ఎన్నికల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పరిస్థితిని ఎందుకు అదుపు చేయలేకపోయారని నిలదీసిన ఈసీ.. దీనికి బాధ్యులు ఎవరంటూ ప్రశ్నించింది. హింసాత్మక ఘటనలు జరిగిన తర్వాత ఏం చర్యలు తీసుకున్నారో పూర్తి వివరణ ఇవ్వాలని ఇరువురి ఉన్నతాధికారులను బుధవారం ఆదేశించిన నేపథ్యంలో వీరు ఎన్నికల సంఘం ఎదుట హాజరయ్యారు. దాదాపు 25 నిమిషాల పాటు వీరు కేంద్ర ఎన్నికల సంఘం అధికారుల

..మిగతా 2లో



## ఇండోర్ జాతీయ రహదారిపై

# ఘోర రోడ్డు ప్రమాదం

### ప్రమాదంలో 8 మంది దుర్మరణం

అహ్మదాబాద్, మే 16 (ప్రభాత ఉదయం): దేశంలో రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఓవర్‌టెక్, మద్యం తాగి నడపడం, అతి వేగం తదితర కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ప్రమాదాల వల్ల ఎందరో అమాయకులు బలవుతున్నారు. కుటుంబాలు చిన్నభిన్నమవుతున్నాయి. తాజాగా గురువారం మధ్యప్రదేశ్‌లో

..మిగతా 2లో

# ఆ ప్రచారాన్ని ఖండిస్తున్నాం

## సినిమా ప్రదర్శనల నిలిపివేతపై టీఎఫ్‌పీసీ క్లారిటీ

హైదరాబాద్, మే 16 (ప్రభాత ఉదయం): ఓ అసోసియేషన్ తీసుకున్న నిర్ణయం వల్లే థియేటర్లలో ప్రస్తుతం సినిమాలు ప్రదర్శితం కావడం లేదని వస్తున్న వార్తలను టీఎఫ్‌పీసీ (తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి) ఖండించింది. అది థియేటర్ల యజమానుల వ్యక్తిగతమని పేర్కొంది. ఈమేరకు టీఎఫ్‌పీసీ సెక్రటరీ టి.ప్రసన్నకుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. "గుంటూరు సహా ఆంధ్రాలోని పలువురు సినిమా థియేటర్ల యజమానులు కొన్ని నెలలుగా తగిన ఆదాయం పొందలేకపోతున్నారని, దీంతో డిజిటల్ ప్రొవైడర్లకు ఛార్జీలు చెల్లించలేకపోతున్నారన్న కారణాన్ని చూపుతూ సినిమా ప్రదర్శనలు నిలిపివేసినట్టు మా దృష్టికి వచ్చింది. తెలంగాణలోనూ కొందరు థియేటర్ల యజమానులు.. ఆశించిన స్థాయిలో ప్రేక్షకులు రావడం లేదని ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. ఎన్నికలు, ఐపీఎల్ కారణంగా ఈ పరిస్థితి నెలకొంది. ఓ అసోసియేషన్ వల్లే థియేటర్లు మూతపడ్డాయంటూ వస్తున్న వార్తలను మేం ఖండిస్తున్నాం" "సినిమా థియేటర్ యజమానులుగానీ, మరే ఇతర అసోసియేషన్‌గానీ అపెక్స్ బాడీలకు (తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర వాణిజ్య మండలి, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి) ఎలాంటి నోటీసు ఇవ్వలేదు. కాబట్టి 'థియేటర్లు బంద్' అనే ప్రచారంలో నిజం లేదు. మా సంస్థలు తెలుగు చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఎప్పుడూ కృషి చేస్తాయి" అని ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలోని సింగిల్ స్క్రీన్ థియేటర్ యాజమాన్యాలు బుధవారం నుంచి పది రోజులపాటు ప్రదర్శనల్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే.



# రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషాదం.. పిగుడుపాటుకు ఇద్దరు మృతి

## పలు జిల్లాల్లో వర్షాలకు పంటలకు నష్టం

రాజన్న సిరిసిల్ల, మే 16 (ప్రభాత ఉదయం): రాష్ట్రమంతటా పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ఈదురుగాలులు, ఉరుములు పిడుగులతో వర్షాలు పడ్డాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. జిల్లాలో కురిసిన భారీ వర్షానికిపిడుగు పడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. తంగళ్లపల్లి మండలం భరత్‌నగర్‌లో పిడుగుపాటుకు రామడుగు చంద్రయ్య అనే వ్యక్తి మృతి చెందాడు. అలాగే వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజ్‌పల్లిలో కంబాల శ్రీనివాస్ మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. కాగా, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలకు రహదారుల పక్కన చెట్లు విరిగిపడ్డాయి. పలు చోట్ల ఇండ్ల పైకప్పులు గాలికి కొట్టుకుపోయాయి. విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో వాతావరణం ఒక్కసారిగా మారింది. రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించిన సంగతి తెలిసిందే. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పలు చోట్ల వర్షం కురిసింది. ఇదిలావుంటే సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు వట్ పల్లి, కోహిర్ మండలాల్లో వర్షం కురిసింది. మెదక్ జిల్లా నర్సాపూర్, పాపన్నపేట మండలాల్లో ఈదురు గాలులతో కూడిన వాన పడింది. సంగారెడ్డి పట్టణంలో భారీ వర్షం కురిసింది. అరగంట వ్యవధిలో సంగారెడ్డి పట్టణం తడిసి ముద్దయింది. రోడ్లపై భారీగా పారుతున్న వరద నీటితో వాహన దారులు ఇబ్బందులు పడుతున్నారు. సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట వర్షపు నీరు భారీగా నిలిచింది. పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో డ్రైనేజీలు పొంగిపొర్లుతుండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గాలి దుమారానికి పలు చోట్లు చెట్ల కొమ్మలు విరిగిపడగా.. బారికేడ్లు నెలకొరిగాయి.



### ఇండోర్ జాతీయ రహదారిపై

# ఘోర రోడ్డు ప్రమాదం

మొదటి పేజీ తరువాయి...

ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఇండోర్-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో 8 మంది మరణించారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఒకరికి గాయాలు కాగా, అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్ధరాత్రి గుర్తుతెలియని వాహనం, జీపు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఇండోర్-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై ఘటాబిలౌడ్ సమీపంలో జీపు గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొట్టిందని అదనపు పోలీసు సూపరింటెండెంట్ రూపేష్ కుమార్ ద్వివేది తెలిపారు. ప్రమాదం తర్వాత డ్రైవర్ పరారీ అయితే ప్రమాదం తర్వాత డ్రైవర్ సంఘటన స్థలం నుండి పారిపోయాడని, అతన్ని పట్టుకునేందుకు గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. ప్రమాదానికి సంబంధించి సమీపంలో ఉన్న సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు పోలీసులు. ప్రమాదం జరిగిన వివరాలను పోలీసులు స్థానికులను అడిగి తెలుసుకుంటున్నారు. ప్రమాదంలో గాయపడిన వ్యక్తి వాంగ్మూలం వచ్చిన తర్వాతే ఈ ప్రమాదం ఎలా జరిగిందో స్పష్టమవుతుంది.

### తెలంగాణలో పలుచోట్ల

# భారీ వర్షాలు

మొదటి పేజీ తరువాయి...

వర్షానికి భారీ వృక్షాలు నేలకూలాయి. వర్షానికి జనజీవనం స్థంభించింది. పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లోనూ వర్షం కురుస్తోంది. జీహెచ్ఎంసీ పరిధిలోని మణికొండ, పుప్పాలగూడ, నార్సింగి, కోకాపేట్, హిమాయత్ నగర్, బండ్లగూడ తదితర ప్రాంతాల్లో చిరుజల్లులు మొదలయ్యాయి. మరోవైపు, వచ్చే 5 రోజులపాటు రాష్ట్రంలోని పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. గురువారం మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కి.మీల వేగంతో గాలులతోపాటు ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ ఐదు రోజుల పాటు ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ యెల్లో హెచ్చరికలను జారీ చేసింది. బుధవారం తూర్పు విదర్భ దాని పరిసర ప్రాంతాలలో కొనసాగిన ఆవర్తనం గురువారం మధ్యప్రదేశ్ నైరుతి ప్రాంతాలలో సగటు సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉన్నట్లు పేర్కొంది. రాష్ట్రంలోకి క్రింది స్థాయి గాలులు ప్రధానంగా ఆగ్నేయ దిశ నుంచి వీస్తున్నట్లు పేర్కొంది.

## ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకోండి

జిల్లా ప్రతినిధి,మే 16(ప్రభాత ఉదయం) జిల్లాలో ఉత్తమ పాఠశాలలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికాణి శ్వేత ప్రియదర్శిని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 2024-25 సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం కింద డే స్కాలర్స్, రెసిడెన్సియల్ పాఠశాలల్లో 1వ తరగతిలో డే స్కాలర్స్‌గా ప్రవేశం కోసం 2018 జూన్ 1 నుంచి మే 30 వరకు పుట్టిన, 5 తరగతి ప్రవేశానికి 4వ తరగతి బోనాఫైడ్ సర్టిఫికెట్ జత చేయాలన్నారు.జిల్లాకు మొత్తం 57 నాన్ రెసిడెన్సియల్ ,59 రెసిడెన్సియల్ సీట్లు కేటాయించడం జరిగింది అన్నారు.అభ్యర్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షల లోపు గ్రామీణ ప్రాంతాల్లో, రూ.2లక్షల లోపు పట్టణ ప్రాంతాల వారికి ఉండాలన్నారు.కుల, ఆదాయ, రేషన్ కార్డు, 2 పాస్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు, డేట్ అఫ్ బర్త్ సర్టిఫికెట్ ఉండాలని చెప్పారు. బాలుర బాలికల పాఠశాలలో ప్రవేశానికి ఫారాలు ఈనెల 18 నుంచి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం లో ఉచితంగా పొందగలరు, దరఖాస్థులను పూర్తి చేసి స్వయంగా కార్యాలయంలో సమర్పించాలన్నారు. జూన్ 07 వ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు.ఇతర వివరాల కోసం 9603117181 , 7981067369 నెంబర్లను సంప్రదించగలన్నారు.



### రాష్ట్ర ఆదాయం పెంపుపై

# సీఎం సమీక్ష

మొదటి పేజీ తరువాయి...

ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎక్కడెక్కడ, ఏయే ప్రాంతాల్లో ధరలను సవరించాలి, వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, అపార్ట్మెంట్లు.. వేటికి ఎంత సవరించాలనేది శాస్త్రీయంగా నిర్ధారణ జరగాలని, రిజిస్ట్రేషన్ స్టాంపుల విభాగం నిబంధనలను పక్కాగా పాటించాలని సీఎం చెప్పారు. రాష్ట్ర రాబడి పెంపుతో పాటు స్థిరాస్థి, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా భూముల మార్కెట్ ధరల సవరణ జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే స్టాంప్ డ్యూటీ ఎంత మేరకు ఉంది.. తగ్గించాలా.. పెంచాలా.. అనేది కూడా అధ్యయనం చేయాలని సూచించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగుల కొరత లేకుండా సర్దుబాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే చాలాచోట్ల అద్దె భవనాల్లో ఉన్నాయని, రిజిస్ట్రేషన్లకు వచ్చే వాళ్లు ఇప్పటికే చెట్ల కింద నిలబడే ఉంటున్నారని చర్చకు వచ్చింది. పబ్లిక్ యుటిలిటీకి సేకరించిన స్థలాలను గుర్తించి కొన్నిచోట్ల అధునాతనంగా మోడల్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మించాలని, అందుకు సన్నాహాలు చేయాలని సీఎం చెప్పారు. సామాన్యులకు, చిన్న చిన్న నిర్మాణాలకు ఇసుక కొరత రాకుండా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఇసుక ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను ఎక్కడికక్కడ అరికట్టాలని ఆదేశించారు.

# పివోకెపై పట్టు కోల్పోయేలా చేసారు

## నాటి కాంగ్రెస్ తప్పిదాలపై జైశంకర్ ఘాటు విమర్శలు

న్యూఢిల్లీ, మే 16 (ప్రభాత ఉదయం) ఒకరు చేసిన పొరబాటు కారణంగా పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)పై భారత్ తాత్కాలిక నియంత్రణ కోల్పోయిందని విదేశాంగ మంత్రి జై శంకర్ పేర్కొన్నారు. 'విశ్వబంధు భారత్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆ పార్టీ హయాంలో జరిగిన తప్పులను ఎత్తిచూపారు. లక్ష్మణ రేఖను దాటి పీవోకేను భారత్ విలీనం చేసుకుంటుందా? అని అడిగిన ప్రశ్నకు.. జై శంకర్ స్పందిస్తూ.. 'లక్ష్మణ రేఖ లాంటివి ఉన్నాయంటే నేను నమ్మను. పీవోకేను భారత్‌లో భాగంగానే భావిస్తున్నా. కొందరి బలహీనత వల్ల అది చేజారింది. పీవోకేపై పట్టు కోల్పోయేందుకు వారి పొరబాటే కారణం అని పరోక్షంగా నెహ్రూను ఉద్దేశించి ఆరోపణలు చేశారు. విశ్వవేదికపై మన స్థానాన్ని బలంగా ఉంచుకోవాలని భావిస్తున్నానని.. స్వీయ విశ్వాసాన్ని ఎన్నడూ వీడకూడదని అన్నారు. పదేళ్లక్రితం ఎవరూ ఇలా మాట్లాడి ఉండకపోవచ్చంటూ కాంగ్రెస్‌పై విమర్శల బాణాలు ఎక్కుపెట్టారు. భారత్ విషయంలో చైనా చేపట్టిన చర్యలను ఆ దేశంలో రాయబారిగా ఉన్నప్పుడు గమనించా. ఆ దేశం తీరు మనందరికీ బాగా తెలుసు. అది పాకిస్థాన్‌తో (సీపెక్‌ను ఉద్దేశిస్తూ) కలిసి పని చేస్తోంది. తమది కాని భూభాగాలను ఆక్రమించుకోలేరని ఆ రెండు దేశాలకు చాలాసార్లు స్పష్టంచేశాం. వాటిపై భారత్‌దే హక్కు' అని అన్నారు. పీవోకే విలీనంపై చైనా ప్రతిస్పందనపై అడిగిన ప్రశ్నకు జై శంకర్ ఈవిధంగా స్పందించారు.




## ప్రాథమిక పాఠశాల సిబ్బందికి ప్రతినెల వేతనాన్ని అందిస్తున్న శ్రీరంగం ఫౌండేషన్

కూకట్‌పల్లి, మే 16 (ప్రభాత ఉదయం) కూకట్‌పల్లి నియోజకవర్గం కేపీహెచ్ బి కాలనీలోని భువన విజయం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనా రాజ కుమారి గతంలో ఇద్దరు ఉపాధ్యాయులకు, అదేవిధంగా పాఠశాలలోని తరగతి గదులు శుభ్రం చేసే వ్యక్తికి వేతనాన్ని ఇవ్వమని శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ డా. సత్యం శ్రీరంగం ను కోరగా అందుకు శ్రీరంగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2023 -2024 విద్యా సంవత్సరానికి గాను ప్రతి నెల వేతనాన్ని ఇస్తామని ఇచ్చిన మాట ప్రకారం మే నెల వేతనాన్ని కూడా శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్మన్ ఇందుమతి శ్రీరంగం చేతుల మీదుగా వారి కార్యాలయంలో గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగం ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




### ఏపీలో హింసాత్మక ఘటనలపై

# ఈసీ సీరియస్

మొదటి పేజీ తరువాయి...

ఎదుట వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. పల్నాడు, తాడిపత్రి దాడులు, చంద్రగిరిలో ఏకంగా ఓ పార్టీ అభ్యర్థిపైనే దాడి చేయడం.. అటు, శ్రీకాకుళం నుంచి ఇటు కర్నూలు వరకూ జరిగిన హింసాత్మక ఘటనలపై ఈసీ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముందుగానే ఆదేశించినా.. అధికారులు ఉదాసీనంగా వ్యవహరిం చారని మండిపడినట్లు సమాచారం. ముందస్తుగా ఇంటెలిజెన్స్ సమాచారాన్ని ఏ విధంగా క్రోడీకరించుకున్నారో. దానికి తగిన ఏర్పాట్లు కూడా తమ దృష్టికి రాలేదని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 13న పోలింగ్ సందర్భంగా అనంతరం కూడా పల్నాడు, తాడిపత్రి, తిరుపతి, మాచర్ల ప్రాంతాల్లో భారీగా హింస చెలరేగింది. టీడీపీ, వైసీపీ వర్గాలు ఒకరికొకరిపై రాళ్లు, కర్రలతో దాడులు చేసుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో పెట్రోల్ బాంబులు, బాణాసంచాతోనూ దాడులు జరిగాయి. ఈ క్రమంలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతిలో చంద్రగిరి నుంచి టీడీపీ అభ్యర్థిగా ఉన్న పులివర్తి నానిపై వైసీపీ కార్యకర్తలు మంగళవారం దాడికి పాల్పడ్డారు. అక్కడ స్ట్రాంగ్ రూంల పరిశీలనకు వెళ్లిన ఆయన తిరిగి వస్తున్న సమయంలో దాడి చేశారు. రాళ్లు, ఆయుధాలతో దాడి చేయగా.. నాని, ఆయన భద్రతా సిబ్బందికి కూడా గాయాలయ్యాయి. వైసీపీ శ్రేణులను చెదరగొట్టేందుకు నాని భద్రతా సిబ్బంది రెండు రౌండ్లు గాల్లోకి కాల్పులు జరిపారు. అనంతరం అక్కడికి చేరుకున్న టీడీపీ శ్రేణులు ప్రతి దాడికి దిగాయి. దీంతో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. అటు, పల్నాడు జిల్లాలోని మాచర్ల, కారంపూడిలోనూ ఉద్రిక్తతలు చెలరేగాయి. అలాగే, అనంతపురం జిల్లా తాడిపత్రిలోనూ టీడీపీ, వైసీపీ కార్యకర్తల ఘర్షణలతో హింస చెలరేగింది. ఓ సీఐకు సైతం గాయాలయ్యాయి. ఈ క్రమంలో ఈ ఘటనలన్నింటిపైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన కేంద్ర ఎన్నికల సంఘం సీఎస్, డీజీపీలకు సమన్లు జారీ చేసింది. ఇద్దరూ వ్యక్తిగతంగా వచ్చి వివరణ ఇవ్వాలని ఆదేశించింది. దీంతో గురువారం వారు ఎన్నికల సంఘం ఎదుట హాజరై వివరణ ఇచ్చారు. ఎన్నికలు, పోలింగ్ అనంతరం రాష్ట్రంలోని పలుచోట్ల చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలపై ఈసీకి వివరణ ఇచ్చారు. రాష్ట్రంలో విచ్చల విడిగా దాడులు, వాహనాలు తగులబెట్టడం వంటి ఘటనల్ని ఎందుకు అదుపు చేయలేకపోయారని ఈసీ నిలదీసింది. పరిస్థితిని అదుపుచేయకుండా ఏం చేస్తున్నారని ప్రశ్నించిన ఈసీ.. దీనికి బాధ్యులు ఎవరంటూ మండిపడింది.దాదాపు 20 నుంచి 25 నిమిషాల పాటు ఎన్నికల సంఘం అధికారులు వీరి నుంచి వివరణ తీసుకొని పంపించినట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ముందుగానే ఆదేశించినా.. అధికారులు పూర్తిగా నిర్లిప్తంగా వ్యవహరించడంపై మండిపడినట్లు తెలుస్తోంది.

### యూపీలోనూ 'టీఎంసీ' తరహా

# రాజకీయాలకు యత్నం

మొదటి పేజీ తరువాయి...



'టీఎంసీ' అభ్యర్థి పోటీ చేస్తుండటంపై మోదీ స్పందిస్తూ.. "ఇక్కడ సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌లు తమ డిపాజిట్లను దక్కించుకోవడం కూడా కష్టమే. అందుకే ప్రయోగం చేస్తున్నాయి. టీఎంసీ అభ్యర్థిని బరిలోకి దింపి.. బెంగాల్‌లో ఆ పార్టీ తరహా రాజకీయాలను ఇక్కడ తీసుకొచ్చేందుకు యత్నిస్తున్నాయి" అని ఆరోపించారు. దేశాభివృద్ధిని ఎగతాళి చేస్తూ.. ఈ ప్రక్రియ దానంతట అదే జరుగుతుందంటూ ప్రతిపక్షాలు కారుకూతలు కూస్తున్నాయని మండిపడ్డారు. జూన్ 4న లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత 'ఇండియా' కూటమి విచ్ఛిన్నమవుతుందని ప్రధాని మోదీ జోస్యం చెప్పారు. ఓటమి అనంతరం ఎవరిని బలి పశువు చేయాలా? అని చూస్తుందన్నారు. "జూన్ 4 తర్వాత అనేక పరిణామాలు చోటుచేసుకుంటాయి. లఖ్‌నవూ, దిల్లీ యువరాజులు వేసవి విడిది కోసం విదేశాలకు వెళ్లిపోతారు" అని అఖిలేశ్ యాదవ్, రాహుల్ గాంధీలను ఉద్దేశించి విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే అమేథీ నుంచి కనుమరుగయ్యిందని, ఇప్పుడు రాయ్‌బరేలీ నుంచీ మాయమైపోతుందని ఎద్దేవా చేశారు.



## కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కబ్జా చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

### పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు...
### అధికారులు కాలయాపన చేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలి...
### తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్ యుఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్...

కూకట్‌పల్లి, మే 16 (ప్రభాత ఉదయం) కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని గతంలో బిఆర్ఎస్ కబ్జా చేస్తున్నారన్న విషయం లిఖితపూర్వకంగా, ఫోటోలు రూపకంగా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న పాపాన పోవడం లేదని తెలంగాణ రాష్ట్ర ఎన్ఎస్ యుఐ ప్రధాన కార్యదర్శి గొల్ల జాన్ అధికారుల తీరుపై మండిపడ్డారు.129 డివిజన్ సంజయ్ గాంధీనగర్లో గత కొన్ని రోజులుగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న బిఆర్ఎస్ నాయకుల పై గతంలో జిహెచ్ఎంసి అధికారులకు ఫిర్యాదు చేసిన ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డివిజన్ సీనియర్ నాయకులు గొల్ల జాన్ జిహెచ్ఎంసి అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కోలన్ హనుమంత్ రెడ్డి కి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు భూపతి రెడ్డి కి, జ్యోత్స్న శివారెడ్డి కి, పున్నారెడ్డి కి, కెఎం ప్రతాప్ కి, కూన శ్రీశైలం గౌడ్ వారితోపాటు జిహెచ్ఎంసి ప్రిన్సిపల్ సెక్రటరీ కి, బాలానగర్ ఏసీపీ కి లికితపూర్వకంగా ఫిర్యాదును చేయడం జరిగింది అని అన్నారు. విచిత్రం ఏంటి అంటే ఈ కబ్జాదారులను డివిజన్ కి సంబంధించిన కొంతమంది కాంగ్రెస్ నాయకులు ప్రోత్సహించడం హాస్యాస్పదంగా ఉందని, మరి వారి పేర్లు కూడా ఫిర్యాదులో చేర్చడం జరిగిందని అన్నారు. ఎవరున్నా లేకున్నా పార్టీ కోసం నిలబడతామని, అవసరమైతే ప్రాణాలను సైతం లెక్కచేయబోమని ఈ సందర్భంగా గొల్ల జాన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 129 డివిజన్ అధ్యక్షులు రహమతుల్లా, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ సర్కిల్‌లో వర్షం ఇబ్బందులు


శివరాంపల్లి బెస్ట్ ప్రైజ్ వద్ద సర్వీస్ రోడ్డు లో నిలచిన వరద నీటిని పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ కె. రవికుమార్, ఏ ఈ వెంకోబా


ఉప్పర్ పల్లి 191 పిల్లర్ వద్ద రోడ్డుపై నిలచిన వరద నీరు

## 20 సంవత్సరాలుగా ఇదే దుస్థితి పట్టించుకునేవారు లేక ప్రజల అవస్థలు

బుద్వేల్, మే16(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ లో గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాహన దారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అత్తాపూర్ నుంచి పీడీపీ వైపు వెళ్లే మార్గంలో ఉప్పర్ పల్లి పిల్లర్ నెంబర్ 191 వద్ద, శివరాంపల్లి బెస్ట్ ప్రైస్ వద్ద,


బాబుల్ రెడ్డి నగర్ లో రోడ్డుపై వర్షం నీరు

ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి క్రింద, రాందేవ్ బాబా దేవాలయం సమీపంలో వర్షపు నీరో రోడ్డుపై నిలిచి ఉంటుండడంతో వాహన దారులు గంట నుంచి రెండు గంటల పాటు ఇబ్బందులు పడ్డారు.

### ఉప్పర్‌పల్లి పిల్లర్ నెంబర్ 191 వద్ద....

గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షం కారణంగా ఉప్పర్ పల్లి పిల్లర్ నెంబర్ 191 వద్ద వరద నీరు రోడ్డుపై చేరి చెరువు ను తలపించింది. మెహదీ పట్నం వైపు నుంచి ఆరాంఘర్ వైపు వెళ్లే వాహనాలు 191 పిల్లర్ వద్ద నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది . ఈ సమస్య గత 20 సంవత్సరాలుగా ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు ఎవరు పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు . నీరు నిలువ ఉండడం కూడా వాహన దారులకు ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన అవసరం ఉంది. శివరాంపల్లి బెస్ట్ ప్రైజ్ వద్ద సర్వీస్ రోడ్డు లో ఉన్నటువంటి డ్రైనేజీ పైప్ లైన్ బ్లాక్ కావడంతో ప్రతిసారి వర్షం పడినప్పుడు ఈ సమస్య ఎదురవుతుంది. ఈ సమస్యకు పరిష్కారం చూడాల్సిన అధికారులు ఆ దిశలో ముందుకు సాగడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

### ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి కింద....

వర్షం పడినప్పుడల్లా ఆరాంఘర్ రైల్వే బ్రిడ్జి కింద వరద నీరు చేరుతుంది. మురుగు నీరు కూడా లీకేజ్ అవుతుండడంతో రైల్వే బ్రిడ్జి కింద నిల్వ ఉన్న నీటిలో డ్రైనేజీ నీరు కలిసి దుర్వాసన వెదజల్లుతుంది. వాహనాల రాకపోకలకు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటి లోనే వాహనాలు నడుపుతూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

### సమస్యలకు పరిష్కారం చూపరా ..

వర్షం పడినప్పుడల్లా వర్షపు నీటితో పాటు మురుగునీరు రోడ్లపైకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా, అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు బాధను వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడినప్పుడు బాగుచేసే అధికారులు శాశ్వతమైన పరిష్కారం కనుగొనాలని సూచిస్తున్నారు . ప్రజా ప్రతినిధులు ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగాలని కోరుతున్నాను. శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం: డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్

రాజేంద్రనగర్ సర్కిల్‌లో వర్షం కురిసినప్పుడు లోతట్టు ప్రాంతాలలో వరదనీరు రోడ్లపై నిల్వఉండకుండా కావలసిన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డిప్యూటి కమిషనర్ కె. రవి కుమార్ తెలిపారు. వర్షం పడిన వెంటనే బృందాలుగా విడిపోయి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. ఉప్పర్ పల్లి 191 పిల్లర్ వద్ద, శివరాంపల్లి బెస్ట్ ప్రైస్ వద్ద, ఆరాంఘర్ రైల్వేబ్రిడ్జి కింద, ఎలాంటి ఇబ్బందులు కలకుండా నాతో పాటు అధికారులు కలిసి సమస్యను గంట నుంచి రెండు గంటల లోపల పరిష్కరించాం. ప్రజలు మ్యాన్ హెూల్ లను తొలగించవద్దన్నారు. చెత్తను మ్యాన్ హెూల్ లో వేయవద్దని సూచించారు.


శివరాంపల్లి దారుల్ ఉలూమ్ వద్ద నీళ్లలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు


కొండా విశ్వేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

# చేవెళ్ల పార్లమెంటు బీజేపీదే

బుద్వేల్, మే16(ప్రభాత ఉదయం) : చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం లో బీజేపీ విజయం నిర్ణయం అయిందని ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ రెడ్డి అన్నారు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ లోని ఎస్ వీ ఎం గ్రాండ్ లో జరిగిన రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ ముఖ్య నాయకుల సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికలలో ప్రధాని నరేంద్ర మోడీ మార్క్ స్పష్టంగా కనిపించిందన్నారు . దేశం కోసం బీజేపీ కి ఓటు వేయాలని, ప్రధానిగా నరేంద్ర మోడీ ఉంటేనే దేశ భద్రత సాధ్యమని ప్రతి ఓటరు చెప్పడం జరిగిందన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి పార్టీ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్ రెడ్డి గెలుపు కోసం శ్రమ పడ్డార న్నారు. ఇదే స్ఫూర్తిని స్థానిక సంస్థల ఎన్నికలలో కనబరచాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ జిల్లా, రాజేంద్రనగర్ నియోజకవర్గ నాయకులు డాక్టర్ ప్రేమ్ రాజ్, వై శ్రీధర్, ఎన్. మల్లారెడ్డి , తోకల శ్రీనివాస్ రెడ్డి, బొక్క బాల్ రెడ్డి, ఎం. కొమురయ్య పి.మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ నాయకులు ఎంతో కష్టపడి పని చేశారన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చేవరకు ఇదే ఐక్యతను, స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. పార్లమెంట్ నియోజకవర్గంలో పోలైన ఓట్లలో 50 నుంచి 54 శాతం ఓట్లు బీజేపీ అభ్యర్థికి పడ్డాయని బీమా వ్యక్తం చేశారు.

### నాయకులతో కలిసి భోజనం చేసిన కొండ విశ్వేశ్వర్ రెడ్డి

నియోజకవర్గ బీజేపీ ముఖ్య నాయకులతో కలిసి ఆ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి , ఆయన సోదరి కొండ గౌతమిరెడ్డి లు భోజనం చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనకోసం పనిచేసిన ప్రతి నాయకునికి, కార్యకర్తకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు రాచూరి రాజశేఖర్ , మేకల వనిత దామోదర్ రెడ్డి, ఎస్ జయానంద్ రెడ్డి, సులిగె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

## రైతుల విషయంలో బీఆర్ఎస్ బ్యాచ్ గగ్గోలు చూస్తుంటే 'గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించిందట' సామెత గుర్తుకు వస్తోంది

### వనపర్తి జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి




కొత్తకోట, మే 16(ప్రభాత ఉదయం) మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్ర శేఖర రావు పదేళ్ల పాలనలో రైతు సమస్యలు పట్టించు కునే నాథుడే లేదని వనపర్తి జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. గురువారం ఓ ప్రకటనలో శ్రీనివాస్ రెడ్డి మాట్లాడు తూ... ధాన్యం తడిస్తే కొనే దిక్కులేదన్నారు. అకాల వర్షాలతో పంట నష్టం జరిగితే పైసా సాయం లేదన్నారు.పంటల బీమా పథకం లేదన్నారు. వరి కుప్పలపై రైతులు గుండెలు పగిలి చచ్చినా పట్టించుకున్న నాథుడు లేదన్నారు. ఖమ్మంలో మిర్చికి ధర అడిగినందుకు గిరిజన రైతులకు బేడీలు వేసి ఇబ్బందులకు గురిచేసిందన్నారు. వరంగల్ లో పత్తి రైతుల ఆత్మహత్యల గోస విన్నది లేదు.ఎన్సీఆర్బీ నివేదిక ప్రకారం 8 వేల పై చిలుకు రైతులు మరణిస్తే ప్రభుత్వంలో చలనం లేదు. రైతులకు ఎరువులు ఫ్రీ అని మోసం చేసి మొండి చేయి చూపితే తప్పు లేదు. 2018 ఎన్నికల మ్యానిఫెస్టోలో రూ.1 లక్ష రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చి 2023 ఆగస్టు వరకు దాని ఊసే ఎత్తకుండా.. ఎన్నికలు వస్తున్నాయని మొదలు పెట్టిన రుణమాఫీ రైతుకు చేరనే లేదు.- రైతులకు సంబంధించిన అన్ని సబ్సిడీలు బంద్ చేస్తే తప్పు లేదు- వరి వేస్తే ఉరేనని రైతులను బెదిరిస్తే అన్యాయం అన్నోడు లేదు.కాంట కాడ దళారుల చేతివాటంతో క్వింటాల్ కు 10 కేజీలు తరుగు పేరుతో దోచేసినా ఏ నాడు పట్టించుకోని కేసీఆర్.- సివిల్ సప్లై కార్పొరేషన్ లో రూ.56 వేల కోట్ల అప్పుల పాలు చేసిన బీఆర్ఎస్ సర్కారు.- 24 గంటల ఉచిత విద్యుత్ పేరుతో ఒక వైపు స్కాం.. మరోవైపు 10 గంటలు కూడా నాణ్యమైన విద్యుత్ ఇవ్వని కేసీఆర్ ఇన్ని పాపాలు చేసి.. రైతుల పాలిట శాపాలుగా మారి.. ఇప్పుడు తగుదునమ్మా అని.. 100 రోజుల పాలనలోనే రైతు భరోసా రూ.7,500 కోట్లు వేసి- ఆగస్టు 15 లోపు రైతుకు రూ.2 లక్షల రుణమాఫీకి కార్యచరణ ప్రకటించి,- వచ్చే పంట నుండి క్వింటాల్ కు రూ.500 బోనస్ ఇవ్వడానికి నిర్ణయం తీసుకున్న -అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇచ్చి- పంటల బీమాకు శ్రీకారం చుట్టి ప్రతి పంటకు మద్ధతు ధర ఇవ్వడానికి సిద్ధమైన ప్రజా ప్రభుత్వాన్ని, విమర్శించడమే పనిగా పెట్టుకున్న కెసిఆర్ అండ్ కోకు ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు.

# కరిగిన.. ఖాకి హృదయం

### స్పృహ కోల్పోయి పడివున్న వృద్ధురాలను ఆసుపత్రికి తరలించిన ఏ ఎస్ ఐ స్పందించని కన్నకొడుకు.. ఏఎస్ఐ కి సర్వత్ర అభినందనలు


వృద్ధురాలికి సహాయపడుతున్న ఏఎస్ఐ

నాగర్ కర్నూల్ ,మే16(ప్రభాత ఉదయం) ఒకవైపు ఎండలు.. మరోవైపు ఆకలి.. దప్పికలు తట్టుకోలేక స్పృహ కోల్పోయి పడి ఉన్న ఓ వృద్ధురాలు పట్ల ఓ ఖాకి స్పందించిన తీరు అందరి హృదయాలను చూరగొంటుంది. వివరాలలోకి వెళితే నాగర్ కర్నూల్ మండలం దేశి ఇటిక్యాల గ్రామానికి చెందిన లక్ష్మమ్మ అనే వృద్ధురాలు కుటుంబ సభ్యుల నిరాదరణ వల్ల అయితే నేమి.. ఇతర కారణాలవల్ల అయితే నేమి నాగర్ కర్నూలు జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఎండ తీవ్రత .. ఆకలి దప్పికలతో .. అలసిపోయి స్పృహ తప్పిపోయింది. పాదాచారులు కొంతమంది చూసి విషయాన్ని పోలీసులకు చేరవేశారు. ఏఎస్ఐ వజ్ర లింగం వృద్ధురాలు వద్దకు వెళ్లి పరిస్థితిని పరిశీలించాడు. ఏ మాత్రం ఆలోచించకుండా ఆటోలో ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య సేవలు అందించడంలో తన వంతు పాత్ర పోషించాడు. వృద్ధురాలు ఆచూకీ తెలుసుకొని కుమారుడికి ఫోన్ చేస్తే అతను స్పందించకపోవడంతో.. గ్రామస్తులు సహకారంతో కూతురుకు సమాచారం అందించాడు. కూతురు ఆసుపత్రికి చేరుకొని తన తల్లి బాగోగులు చూసుకుంటుంది. సంఘటన రెండు రోజుల క్రితం జరిగింది. సామాజిక మాధ్యమాలలో ఇందుకు సంబంధించిన దృశ్యాలు హల్చల్ చేస్తున్నడంతో నె టిజర్లు అభినందనలు తెలుపుతున్నారు.



# అమ్మవారికే శఠగోపం...!

### దేవాదాయ భూమి దర్జాగా రిజిస్ట్రేషన్.. మరోమారు అమ్మకానికి అమ్మవారి ఆస్థి
### రూ.15 కోట్ల రూపాయల విలువైన భూమి అన్యాక్రాంతం
### దేవాదాయ శాఖకు గ్రామస్తుల ఫిర్యాధు



షాద్ నగర్,మే16 (ప్రభాత ఉదయం): డబ్బు సంపాదన కోసం ఏకంగా అమ్మవారి ఆస్థికే ఎసరు పెట్టారు ఆ ప్రబుద్ధులు.. దేవాలయానికి చెందిన కోట్ల విలువైన భూమిని యదేచ్ఛగా రిజిస్టర్ కూడా చేసుకున్నారు.దేవాదాయ శాఖ కళ్లు గప్పి తమ కబందాల్లోకి తీసుకున్న సదరు భూమిని మరోమారు అమ్మజూపుతూ భూ పందేరానికి తెరలేపి.దేవుడి భూమినీ మాయం చేయాలని చూస్తున్న మాయగాళ్ళ బాగోతంపై ప్రత్యేక కథనం...ఆ అమ్మవారి దయ ఉంటే అంతా మంచే జరుగుతుంది.ఆమె ఆశీస్సుల కోసం నిత్యం ఉపవాసాలు ఉంటూ పూజలు చేసే వారూ ఉన్న ప్రస్తుత తరుణంలో ఆ అమ్మవారి ఆస్థినే టార్గెట్ చేశారు.ఏకంగా అమ్మవారి ఆలయ భూములను క్రయ,విక్రయాలు చేస్తూ సొమ్ము చేసుకోవాలని చూస్తున్న వ్యక్తులు లేకపోలేదు.రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలంలో వెలుగు చూసిన ఈ బాగోతం మీరే చదవండి.రంగారెడ్డి జిల్లా పరూఖ్ నగర్ మండలంలోని ఎలికట్ట గ్రామంలో గల శ్రీ అంబా భవాని మాత దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఎన్నో సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ పురాతన ఆలయం ప్రతి నిత్యం కొలిచే భక్తులకు కొంగు బంగారంగా నిలస్తున్నది.ఈ దేవాలయాన్ని పూర్తిగా 2008 సంవత్సరంలో దేవాదాయ శాఖ తమ ఆధీనంలోకి తీసుకుంది.అయితే గ్రామంలోని శ్రీ అంబా భవాని మాత దేవాలయం పేరున గ్రామ శివారులో సర్వే నెంబర్ 441లో 3 ఎకరాల 28 గుంటల భూమి ఉంది.బహిరంగ మార్కెట్ లో సదరు భూమి విలువ సుమారుగా 15 కోట్ల పైమాటే.ఈ మొత్తం భూ విస్తీర్ణాన్ని దేవాదాయ శాఖ రిజిస్టరు 43 లో గతంలోనే నమోదు చేసింది.ఇదిలా ఉండగా ఈ భూమిపై కన్నేసిన కొందరు వ్యక్తులు అనుభవదారులమంటూ చెప్తూ 2015 లో అక్రమంగా 2031/ 2015 డాక్యుమెంట్ ద్వారా రిజిష్టర్ చేశారు.ఈ తరహాలో రిజిష్టర్ చేసుకున్న తుమ్మలపల్లి గుల్లె కృష్ణయ్య ను రెవెన్యూ రికార్డులో పట్టాదారునిగా చూపారు.అయితే సదరు భూమిని కొన్న వ్యక్తి మరోమారు భూమిని విక్రయించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు.ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న గ్రామస్తులు కొందరు అంబా భవాని మాత దేవాలయానికి సంబంధించిన భూములను కాపాడాలంటూ దేవాదాయ శాఖ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు.నిబంధనలకు విరుద్ధంగా అమ్మవారి ఆస్థిని అమ్మిన వారిపై, కొన్నవారిపై కఠిన చర్యలు తీసుకుని అంబా భవాని మాత ఆలయ భూములను కాపాడాలని కొరారు.అయితే ఇదే తరహాలో షాద్ నగర్ నియోజక వర్గంలో చాలా వరకు దేవదాయ భూములు అన్యాక్రాంతం అయినట్లు తెలుస్తుంది.మరి ఆ శాఖ అధికారులు ఈ విషయంలో ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.


తన రక్తంతో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి వేసిన అభిమాని

# రక్తంతో సియం రేవంత్ రెడ్డి చిత్ర పటం

### చాటుకున్న అభిమానం.. అభినందించిన సియం

మద్దూరు( కొత్తపల్లి),మే 16 (ప్రభాత ఉదయం): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అభిమానంతో తన రక్తంతో స్వయంగా ముఖ్యమంత్రి చిత్ర పటాన్ని గీశాడు ఓ అభిమాని. నియోజకవర్గ ప్రజల అభ్యున్నతికై నిర్విరామంగా శ్రమిస్తు నియోజకవర్గ ప్రజల శ్రేయస్సుకు సుమారు 4900 కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి కృతజ్ఞతా భావంతో మద్దూరు మండలానికి చెందిన సోషల్ మీడియా కోఆర్డినేటర్ గంగుల హరీశ్వర్ రెడ్డి తన రక్త నమునాతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చిత్రపటం తన స్వహస్తాలతో గీసి గురువారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో చిత్రపటాన్ని ఆయనకు అందించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిపించుటకు నియోజకవర్గ ప్రజలు వెన్నంటే ఉంటామని ముఖ్యమంత్రి కి తెలియజేశారు. రక్తనము నాతో చిత్రపటాన్ని గీసిన హరీశ్వర్ రెడ్డి కి నియోజకవర్గ ప్రజలు కృతజ్ఞతలు చాటుకుంటున్నారు.



## పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు

### కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్


కూకట్‌పల్లి, మే 16 (ప్రభాత ఉదయం) కాంగ్రెస్ పార్టీ గెలిపే ధ్యేయంగా పార్లమెంట్ ఎన్నికలలో పనిచేసిన ప్రతి ఒక్కరికి ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ 124 డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ గురువారం ఆయన కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాళ్లు మర్యాద పూర్వకంగా కలశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డి విజయం కోసం పనిచేసిన ప్రతిఒక్కరికి పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాజ్యలక్ష్మి, పుట్టం దేవి, సౌందర్య, అనురాధ, కృష్ణవేణి, యోగేశ్వరి, నాగలక్ష్మి, నిర్మలమ్మ, అన్నపూర్ణ, శ్యామల, లలిత కుమారి తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షంతో గుజరాత్‌తో మ్యాచ్ రద్దు

## ప్లేఆఫ్ రేసులో హైదరాబాద్

**ఐపీఎల్ 2024లో సన్‌రైజర్స్ హైదరాబాద్ - గుజరాత్ టైటాన్స్‌ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దు అయింది. హైదరాబాద్ వేదికగా ఈ మ్యాచ్ జరగాల్సి ఉండగా.. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో మ్యాచ్ నిర్వహించే పరిస్థితి లేదని అంపైర్లు తేల్చేశారు. మ్యాచ్ రద్దు చేసి ఇరు జట్లకు చెరో పాయింట్ కేటాయించారు. ఫలితంగా 15 పాయింట్లతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేఆఫ్స్ బెర్తును ఖరారు చేసుకుంది.**



ప్లేఆఫ్ రేసులో హైదరాబాద్ అదృష్టం కలిసివచ్చింది. 13వ మ్యాచ్‌లో గుజరాత్‌తో తలపడకుండానే ప్యాట్ కమిన్స్ జట్టు ప్లేఆఫ్స్ లో చోటు దక్కించుకుంది. మరో రెండు జట్లు ఈ రేసు నుంచి ఔట్ అయ్యాయి. హైదరాబాద్ లో కురుస్తున్న భారీ వర్షం కారణంగా ఐపీఎల్ 2024 లో ప్లేఆఫ్స్ కు కీలకమైన మ్యాచ్ రద్దు అయింది. దీంతో హైదరాబాద్ జట్టు మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండానే ఐపీఎల్ 2024 ప్లేఆఫ్స్ కు అర్హత సాధించింది. గ్రౌండ్ కు వచ్చిన అభిమానులు నిరాశతో వెనుదిరిగారు. భారీ వర్షం కారణంగా హైదరాబాద్ నగరంలోని అనేక ప్రాంతాలు నీటమునిగాయి. ఈ క్రమంలోనే ఉప్పల్ స్టేడియం వేదికగా జరగనున్న హైదరాబాద్-గుజరాత్ మ్యాచ్ పై ప్రభావం పడింది. వర్షం కారణంగా టాస్ ఆలస్యం అయింది అయినా వర్షం ఆగకపోవడంతో మ్యాచ్ ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

### కీలక మ్యాచ్ వర్షార్పణం..

ఐపీఎల్ 2024 66వ మ్యాచ్ హైదరాబాద్, గుజరాత్ మధ్య జరగాల్సి ఉంది. అయితే, భారీ వర్షం కారణంగా ఈ మ్యాచ్ రద్దయింది. దీంతో హైదరాబాద్ ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించగా, మరోవైపు రెండు జట్లు ఈ రేసు నుంచి ఔట్ అయ్యాయి. ప్లేఆఫ్‌కు అర్హత సాధించిన మూడో జట్టుగా హైదరాబాద్ నిలిచింది. చెన్నై-ఆర్‌సీబీ మ్యాచ్ పై కూడా వర్షం ప్రభావం ఉండనుందని వాతావరణ నివేదికలు బట్టి తెలుస్తోంది.

### ప్లేఆఫ్స్ రేసులో ఆర్సీబీ, సీఎస్కే, ఢిల్లీ

ప్లేఆఫ్స్‌కు ఇప్పటికే రెండు జట్ల అర్హత సాధించాయి. ఇప్పుడు గుజరాత్ తో మ్యాచ్ రద్దుకావడంతో హైదరాబాద్ మూడో టీమ్ గా ప్లేఆఫ్స్ కు అర్హత సాధించింది. ఇందులో టేబుల్ టాపర్ కోల్‌కతా కాగా, తర్వాత రాజస్థాన్ ఉంది. ఇప్పుడు హైదరాబాద్ మూడో స్థానానికి అర్హత సాధించింది. ఆర్‌సీబీ-చెన్నై మధ్య మ్యాచ్ తర్వాత నాలుగో జట్టు ఏదనేది ఖరారు కానుంది. చిన్నస్వామి స్టేడియంలో జరిగే మ్యాచ్ లో ఏ జట్టు గెలిస్తే ఆ జట్టుకు ప్లేఆఫ్‌కు తలుపులు తెరుచుకుంటాయి.

### ఢిల్లీ, లక్నో ఔట్

ఢిల్లీ, లక్నో జట్లు నిరంతరం ప్లేఆఫ్ రేసులో ఉన్నాయి. కానీ వర్షం కారణంగా హైదరాబాద్‌కు ఒక పాయింట్ లభించింది. దీంతో ఢిల్లీ-లక్నో ప్లేఆఫ్ రేసు నుండి దాదాపు నిష్క్రమించినట్టే. ఎందుకంటే ఆ జట్ల రన్ రేటు మైనస్ లో ఉంది. హైదరాబాద్‌కు మరో మ్యాచ్ మిగిలి ఉంది. మే 19న జరిగే లీగ్ రౌండ్‌లో ప్లేఆఫ్‌కు దూరమైన పంజాబ్‌తో హైదరాబాద్ చివరి మ్యాచ్ ఆడనుంది.

### మే 21న తొలి క్వాలిఫయర్ మ్యాచ్..

మే 18న ఆర్‌సీబీ-చెన్నై జట్ల మధ్య మ్యాచ్ తర్వాత ప్లేఆఫ్‌కు వెళ్లే నాలుగు జట్ల పేర్లు వెల్లడికానున్నాయి. మే 21న తొలి క్వాలిఫయర్ మ్యాచ్, ఆ తర్వాత మే 22న ఎలిమినేటర్ మ్యాచ్ జరగనుంది. క్వాలిఫయర్-2 మే 24న జరగనుండగా, ఐపీఎల్ 2024 ఫైనల్ మ్యాచ్ మే 26న జరగనుంది.



# సునీల్ ఛెత్రి రిటైర్మెంట్..

### ఫుట్‌బాల్ దిగ్గజం భావోద్వేగం, హైదరాబాద్‌తో అనుబంధం

భారత్‌లో ఫుట్‌బాల్ పేరు చెప్పగానే గుర్తుచ్చే పేరు 'సునీల్ ఛెత్రి'. క్రికెట్‌ను ఓ మతంలా ఆరాధించే భారత గడ్డపై ఫుట్‌బాల్‌కు మంచి గుర్తింపును తీసుకొచ్చిన ఆటగాడు అతడు. ఇండియన్ ఫుట్‌బాల్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఈ పేరు ఇకపై ఫుట్‌బాల్ టోర్నీలలో వినిపించదు. సునీల్ ఛెత్రి ఆటకు రిటైర్మెంట్ ప్రకటించాడు. జూన్ 6వ తేదీన కువైట్‌తో జరిగే ఫీఫా వరల్డ్ కప్ క్వాలిఫయర్ మ్యాచ్ తనకు చివరిదని ప్రకటించాడు. రిటైర్‌మెంట్ గురించి తన తల్లి, భార్యకు చెప్పినప్పుడు కన్నీళ్లు పెట్టుకున్నారని తెలిపాడు. రిటైర్మెంట్ ప్రకటన చేస్తూ భావోద్వేగ వీడియో విడుదల చేశాడు. దీంతో సునీల్ ఛెత్రి పేరు గూగుల్ టాప్ ట్రెండ్స్‌లో ఒకటిగా నిలిచింది. భారత్ తరఫున 2005లో జాతీయ జట్టులోకి అడుగు పెట్టాడు సునీల్ ఛెత్రి. ఇప్పటివరకు అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 94 గోల్స్ కొట్టాడు. అంతర్జాతీయంగా ఇప్పుడున్న యాక్టివ్ ప్లేయర్లలో ఎక్కువ గోల్స్ చేసిన మూడో ఆటగాడు సునీల్ ఛెత్రి కావడం విశేషం. అతడి కంటే ముందు ఫుట్‌బాల్ దిగ్గజాలు క్రిస్టియానో రొనాల్డో (128), లియోనిల్ మెస్సి (106) మాత్రమే ఉన్నారు. సుమారు రెండు దశాబ్దాలుగా భారత్‌లో ఫుట్‌బాల్ ఆటకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్నాడు సునీల్ ఛెత్రి. దేశం తరఫున అత్యధిక గోల్స్ కొట్టిన ఆటగాడు అతడేనని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

భారత జాతీయ జట్టు తరఫున ఇప్పటివరకు 150 మ్యాచ్‌లు ఆడిన సునీల్ ఛెత్రీ.. 94 గోల్స్ చేశాడు. 2011, 2015, 2021లో జరిగిన శాఫ్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్, 2007, 2009, 2012 నెహ్రూ కప్‌లల్లో ఛెత్రి మెరుపు గోల్స్ చేశాడు. 2008లో ఏఎఫ్‌సీ ఛాలెంజ్ కప్‌ను గెలవడంలో అతడు కీలక పాత్ర పోషించాడు.

'19 ఏళ్ల నా ఫుట్‌బాల్ కెరీర్‌లో గొప్ప జ్ఞాపకాలు చాలా ఉన్నాయి. ఒత్తిడి, బాధ్యతలు, అమితమైన ఆనందం.. ఇలా ఎన్నింటినో అనుభవించా. భారత జట్టుకు నేను ఇన్నేళ్లపాటు ఆడతానని అనుకోలేదు. మంచి, చెడులు ఎన్నో చూశా. గత ఒకటిన్నర నెల నుంచి కొత్తగా అనిపిస్తోంది. నేను చివరి మ్యాచ్ ఆడేందుకు సమయం ఆసన్నమైందని నాకు అనిపించింది' అని వీడియోలో సునీల్ ఛెత్రి చెప్పుకొచ్చాడు.

జాతీయ జట్టు కోసం ప్రతి క్షణం కష్టపడ్డానని, కువైట్‌తో మ్యాచ్ మనకు చాలా అవసరం అని సునీల్ ఛెత్రి అన్నాడు. తదుపరి రౌండ్‌కు అర్హత సాధించాలంటే మూడు పాయింట్లు కీలకం అని తెలిపాడు. 'ఈ మ్యాచ్ భారత జట్టుకు ఎంత ముఖ్యమో, వ్యక్తిగతంగా నాకూ అలాగే గుర్తుండిపోయే మ్యాచ్ అవుతుందని అనుకుంటున్నా' అని సునీల్ ఛెత్రి అన్నాడు.


'రిటైర్మెండ్ నిర్ణయం గురించి ఇంట్లో చెప్పినప్పుడు అందరూ బాధపడ్డారు. మా అమ్మ, నాన్న, నా భార్య రియాక్షన్‌ను మాటల్లో చెప్పలేను. నాన్న కాస్త అర్థం చేసుకున్నారు. కానీ, అమ్మతో పాటు నా భార్య ఒక్కసారిగా ఏడవటం ప్రారంభించారు. నాకది భారంగా అనిపించింది. నేను ఆట ఆడేటప్పుడు కూడా వారు చాలా ఒత్తిడికి గురయ్యేవారు. ఇక దేశం తరఫున నేను ఆడటంలేదనే విషయం వారిని బాధపెడుతోందని వారు చెప్పలేకపోయినా నాకు అర్థమైంది' అని సునీల్ ఛెత్రి చెప్పుకొచ్చాడు.



# గాయంతోనే కేన్స్ ఫెస్టివల్‌కు ఐశ్వర్యాయ్

అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ఫ్రాన్స్‌లో జరిగే కేన్స్‌కు ప్రత్యేకత ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఎందరో సినీ తారలు ఈ కార్యక్రమంలో పాల్గొని రెడ్ కార్పెట్‌పై సందడి చేస్తుంటారు. ఈ కేన్స్ వేడుకల్లో బాలీవుడ్ స్టార్ హీరోయిన్, మాజీ ప్రపంచ సుందరి ఐశ్వర్యరాయ్ బచ్చన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంటారు. విభిన్న కాస్ట్యూమ్స్‌తో అలరిస్తుంటుంది. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు కొత్త కళ తెస్తుంటుంది ఐశ్వర్య. ఆమె రెడ్ కార్పెట్‌పై అలా నడుచుకూంటూ వస్తుంటే కెమెరా కళ్లన్నీ ఐష్ వైపే ఉంటాయి. అయితే, ఈ సారి ఆమె గాయంతోనే కేన్స్‌లో పాల్గొనబోతోంది. గాయం కారణంగా చేతికి కట్టుతోనే కుమార్తెతో కలిసి ఐశ్వర్య ఫ్రాన్స్‌కు పయనమైంది. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఫ్రాన్స్ వేదికగా ఏటా కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ అట్టహాసంగా జరుగుతుందన్న విషయం తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందిన సినీ తారలు, మోడళ్లు, డిజైనర్లు, పలువురు సెలబ్రిటీలు ఈ వేడుకలో పాల్గొని విభిన్న ఫ్యాషన్ దుస్తుల్లో రెడ్ కార్పెట్ పై హొయలుపోతుంటారు. బాలీవుడ్ నుంచి కూడా పలువురు తారలు హాజరై ట్రెండీ దుస్తులు ధరించి అందరినీ ఆకర్షిస్తుంటారు. ఇక ఏటా ఐశ్వర్య ఈ వేడుకలకు కచ్చితంగా హాజరవుతుంటుంది. కొత్త కొత్త కాస్ట్యూమ్స్ ధరించి తళుక్కున మెరిసి ఆకట్టుకుంటుంటుంది. అయితే, ఈ సారి ఆమె గాయంతోనే కేన్స్ వేడుకల్లో సందడి చేసేందుకు సిద్ధమైంది.

# నా బ్యాంక్ ఖాతా హ్యాక్ కాలేదన్న రేణూ



తన బ్యాంకు ఖాతా ఏమీ హ్యాక్ అవలేదని, తానే డొనేషన్ కోసం వివరాలు షేర్ చేశానని, సినీ నటి రేణు దేశాయ్ అన్నారు. జంతు సంరక్షణ కోసం రూ.3500 విరాళంగా ఇవ్వాలంటూ ఇన్‌స్టా వేదికగా ఆమె పెట్టిన పోస్ట్ వైరల్ అయింది. దీంతో పలువురు నెటిజన్లు స్పందించారు. మరికొందరేమో, ఆమె బ్యాంకు ఖాతాను గుర్తు తెలియని వ్యక్తులు హ్యాక్ చేసి, ఇలా డబ్బులు అడుగుతున్నారని సామాజిక మాధ్యమాల్లో పోస్టుల పెట్టారు. ఈ క్రమంలో రేణు దేశాయ్ వీడియో విడుదల చేశారు. తాను ఆ పోస్ట్ పెట్టడం వెనుక కారణాన్ని వివరించారు. అందరికీ నమస్కారం. కొన్ని రోజుల కిందట నాకు ఫుడ్ పాయిజన్ అయింది. హెల్త్ బాగోలేక వీడియోలు చేయడం లేదు. రూ.3500 కోసం రిక్వెస్ట్ నేనే పెట్టాను.. నా బ్యాంకు ఖాతా హ్యాక్ అవలేదు. విరాళం ఇచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. జంతు సంరక్షణ కోసం నేను రెగ్యులర్‌గా విరాళాలు ఇస్తూ ఉంటాను. దేనికి ఎంత విరాళం ఇవ్వాలనే దానిపై నెలవారీ నాకొక బడ్జెట్ ఉంటుంది. దాని ప్రకారం ఇస్తాను. నా దగ్గర ఉన్న మొత్తం డబ్బు ఇచ్చేస్తే, నా కోసం, నా పిల్లలకు ఏమీ మిగలదు. ఇంటి అవసరాలు చూసిన తర్వాత మిగిలితే, అప్పుడే విరాళాలు అందిస్తాను. మీరు నా సామాజిక మాధ్యమాలను ఫాలో అవుతుంటే మీకు ఆ విషయం తెలుస్తుంది. గత రెండు, మూడు నెలలుగా మాత్రమే విరాళాలు ఇవ్వడం మొదలు పెట్టాను. ఆకలితో బాధపడే చిన్నారుల కోసం, సంరక్షణ అవసరమైన కుక్కలు, పిల్లులు, ఆవులకు సాయం చేస్తా. రాబోయే ఏడాదిన్నరలో షెల్టర్ కట్టేందుకు ప్రయత్నిస్తున్నా. అప్పుడు అధికారికంగా మీ నుంచి విరాళాలు అడుగుతాను. నా బ్యాంకు ఖాతా హ్యాక్ అయిందని మీరు కంగారు పడాల్సిన అవసరం లేదు. మీరు పంపిన డబ్బులు వచ్చాయి. ఆ మొత్తంతో ఏర్పాటు చేసిన ఆహారానికి సంబంధించిన వివరాలను త్వరలోనే పంచుకుంటా' అని రేణు దేశాయ్ అన్నారు.గత కొన్ని రోజులుగా రేణు దేశాయ్ సోషల్ మీడియా నుంచి పెద్దగా అప్‌డేట్స్ లేవు. ఇదే సమయంలో రూ.3500 కావాలని కోరుతూ రేణు దేశాయ్ ఇన్‌స్టా ఖాతాలో ఓ మెసేజ్ పోస్టు అయ్యింది. క్యూఆర్ కోడ్ కూడా షేర్ చేశారు. ఈ పోస్టు చేసిన 5 నిమిషాల్లోనే కొంత మంది అభిమానులు స్పందించారు. వెంటనే డబ్బులు పంపారు. దీంతో ఈ అంశం వైరల్ అయింది.




# నిందతో వస్తున్న వరుణ్ సందేశ్



కాంద్రకోట మిస్టరీ అంటూ యథార్థ సంఘటనల నేపథ్యంలో తెరకెక్కుతోన్న చిత్రం 'నింద'లో వరుణ్ సందేశ్ హీరోగా నటించారు. ఈ మూవీని రాజేష్ జగన్నాథం నిర్మించడమే కాకుండా కథ, కథనాన్ని రాసి దర్శకత్వం వహించారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ పోస్టర్, ఫస్ట్ లుక్ పోస్టర్ మంచి స్పందనను రాబట్టుకోగా.. తాజాగా ఈ మూవీ టీజర్‌ను విలక్షణ నటుడు నవీన్ చంద్ర చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. ఇటీవల జరిగిన దాదా సాహెబ్ ఫాల్కే ఫెస్టివల్ అవార్డ్స్‌లో అవార్డును అందుకున్న నవీన్ చంద్ర టీజర్ విడుదల చేసిన అనంతరం చిత్రయూనిట్‌కు ఆల్ ది బెస్ట్ తెలిపారు. టీజర్ బాగుందని టీంను మెచ్చుకున్నారు. సినిమా మంచి విజయం సాధించి టీమ్ అందరికీ మంచి పేరు తీసుకురావాలని కోరారు. టీజర్ విషయానికి వస్తే.. 'జీవితంలో కొన్ని సార్లు తప్పని తెలిసినా చేయక తప్పదు'.. అనే డైలాగ్‌తో మొదలైన ఈ టీజర్‌లో ఎన్నో కోణాలున్నాయి. అందమైన ప్రేమ కథ కనిపిస్తోంది. దాంతో పాటుగా మర్డర్, క్రైమ్ మిస్టరీ కూడా ఉన్నట్టుగా తెలుస్తోంది. అలాగే టీజర్‌లోని విజువల్స్ కూడా ఎంతో న్యాచురల్‌గా ఉన్నాయి. మరీ ముఖ్యంగా ఆర్‌ఆర్ అయితే మూడ్‌కు తగ్గట్టుగా సాగింది. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌ను ఫీల్ అయ్యేలా నేపథ్య సంగీతం సాగింది. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని.. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నామని దర్శకనిర్మాత తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.